క్లుప్తంగా

ఎంఈఓలుగా బాధ్యతలు స్వీకరణ

కూసుమంచి/కామేపల్లి: కూసుమంచి మండల నూతన ఎంఈఓగా కూసుమంచి ఉన్నత పాఠశాల హెచ్ఎం రాయల వీరస్వామి నియమిస్తూ మంగళవారం ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం వీరస్వామి ఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టగా.. పలువురు అభినందనలు తెలియజేశారు. అలాగే,కామేపల్లి మండలంలోని ఎంజేపల్లి హైస్కూల్ హెచ్ఎం జి.వెంకట్ కామేపల్లి మండల విద్యాశాఖ అధికారిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు ఎంఎస్ఓ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది అభినందించారు.

జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడిగా సైదులు


కనకం సైదులు

ఖమ్మం సహకారనగర్: స్తంభాద్రి జర్నలిస్టు మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌజ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఖమ్మంకు అధ్యక్షుడిగా కనకం సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సొసైటీ ఆవిర్భావం నుంచి అధ్యక్షుడిగా కొనసాగిన ఏనుగు వెంకటేశ్వరరావు రాజీనామాతో ఈ ఎన్నిక అనివార్యమైంది. బుధవారం స్థానిక మంచికంటి భవనంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ),టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్), టీయూబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టు సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. ఈమేరకు అధ్యక్షుడిని ఎన్నుకున్నాక ఇళ్ల స్థలాల సాధనకు సంబంధించి తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించి పలు తీర్మానాలు చేశారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ

నేలకొండపల్లి: మండలంలోని అమ్మగూడెం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన బుధవారం బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తేజావత్ వెంగళరావు, ఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, షేక్ రషీద్, ఉపాధ్యాయురాలు, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శికి సన్మానం

కామేపల్లి: మండలంలోని రుక్కితండ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన రాజేష్‌ను బుధవారం స్థానిక జీపీ కార్యాలయంలో గ్రామస్తులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లకావత్ బీమా, హెచ్ఎం విజయ్‌కుమార్, మేకల మల్లిఖార్జున్‌రావు, వెంకటనారాయణ, రవీందర్, సిరోమణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నగర స్థాయి క్రీడలు


బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు, ముఖ్య అతిథులు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహించిన నగర స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా శ్రీచైతన్య పాఠశాల జట్టు నిలిచింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో అండర్-14, 17 విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు త్వరలో జరిగే జోనల్‌స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారు. కాగా, బహుమతుల ప్రదానోత్సవానికి డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, హార్వెస్ట్ స్కూల్ కరస్పాండెంట్ పి.రవిమారుత్, క్రీడల కార్యదర్శి లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లిలో స్థల వివాదం జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. పైనంపల్లిలోని ఓ స్థల విషయమై ఇరువర్గాలకు పంచాయితీ జరిగింది. బుధవారం జరిగిన వివాదంలో జనార్దన్‌రావు, కల్యాణ్ గాయపడడంతో ఖమ్మం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో...

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కాసాని నాగేశ్వరరావు రహదారి వెంట నడిచి వెళ్తుండగా బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనకు నేలకొండపల్లిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సరిపోదా శనివారం
వినోద	ద గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం
సాయిరాం	100 క్రోర్స్, హైడ్ ఎన్ సీక్
ఆదిత్య	చిక్లెట్స్
శ్రీనివాస	మత్తు వదలరా 2

- ఖమ్మంవ్యవసాయం


బీసీ కాలనీలో ధర్నా చేస్తున్న స్థానికులు


రోడ్డుపై నిలిచిన చెత్త వాహనాలు

'చెత్త' చెలగాటం..

డంపింగ్‌యార్డ్‌కు చేరని చెత్త వాహనాలు

- స్థానికులు అడ్డుకోవడంతో రోడ్లపై బారులుదీరిన వైనం
- అధికారుల ఆదేశాలతో కేఎంసీ ఆవరణలో పార్కింగ్
- రోజురోజుకు ఉధృతమవుతున్న ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్: డంపింగ్‌యార్డ్ సమస్యపై ఆందోళన రోజురోజుకు ఉధృతం అవుతుంది. డంపింగ్‌యార్డ్‌ను దానవాయిగూడెం నుంచి తరలిస్తామని చెప్పే వరకు చెత్త వాహనాలను వెళ్లనిచ్చేదేలే అంటూ స్థానికులు నిరవధిక ధర్నా చేస్తున్నారు. బుధవారం బీసీ కాలనీలో స్థానికంగా నివాసం ఉండే వారు టెంట్ కింద కూర్చుని నిరసన తెలిపారు. వాహనాలను డంపింగ్‌యార్డ్‌కు వెళ్లకుండా అడ్డుకున్నారు. రామన్నపేట నుంచి డబుల్‌బెడ్‌రూం వైపు చెత్త వాహనాలను వెళ్లకుండా అడ్డుకోవడంతో చెత్త సేకరించిన వాహనాలన్ని డంపింగ్‌యార్డ్‌కు చేరకుండా.. రోడ్లపైనే నిలిచి బారులుదీరాయి. పాలకులు, ఉన్నతాధికారులు సమస్య పరిష్కారంపై హామీ ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్థానికులు పేర్కొంటున్నారు.

కేఎంసీ ఆవరణలో పార్కింగ్..

నగరంలోని డివిజన్లలో సేకరించిన వ్యర్థాల లోడ్‌తో డంపింగ్‌యార్డ్‌కు వెళ్తున్న వాహనాలను ఆందోళనకారులు అడ్డుకోవడంతో డ్రైవర్లు వాహనాలను నిలిపివేశారు. లోడ్ చేసిన వ్యర్థాలను పడేసే వీలు లేకపోవడం, రోడ్ల వెంట వాహనాలను నిలిపే పరిస్థితి కూడా లేకపోవడంతో అధికారులు వాటిని కేఎంసీ కార్యాలయం వెనుక ఉన్న ఆవరణకు రప్పించారు. డ్రైవర్లు చెత్త లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలను పార్క్ చేయగా.. ఎక్కువ సమయం ఇలాగే ఉంచితే టైర్లు మరమ్మతులకు గురయ్యే ప్రమాదం ఉందని డ్రైవర్లు పేర్కొంటున్నారు.


కేఎంసీ ఆవరణలో నిలిపిన ట్రాక్టర్లు

మీ సేవా కేంద్రాలు ఏర్పాటు

ఖమ్మంరూరల్: మున్నేరు వరదలో సర్టిఫికెట్లు కోల్పోయిన వారికి ఉచితంగా సర్టిఫికెట్లు అందించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల జారీ చేయడంతో బుధవారం తహసీల్దార్ బి.రాంప్రసాద్ కరుణగిరి, రాజీవ్ గృహకల్పలలో మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రజల నుంచి ఆధార్, కుల, ఆదాయ, రెసిడెన్షియల్ ధ్రువ పత్రాలను అందించేందుకు దరఖాస్తులు స్వీకరించారు. వరదల్లో వివిధ రకాల సర్టిఫికెట్లు పోగొట్టుకున్న వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

కేఎంసీలో పనిచేయని బయోమెట్రిక్ యంత్రాలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో ఉద్యోగులు, సిబ్బంది హాజరు నమోదు కోసం ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మిషన్లు ప్రతీ 20 రోజులకోసారి పని చేయడం లేదు. చిన్నచిన్న సాంకేతిక కారణాలను చూపించి సిబ్బంది వాటిని వినియోగించకుండా చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఇలాగే జరిగితే హాజరు నమోదులో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఇక తాజాగా మూడు రోజుల నుంచి వైఫై నెట్ సౌకర్యం లేక మిషన్లు పని చేయడం లేదని సిబ్బంది చెబుతున్నారు. ఇంటర్నెట్ సౌకర్యం కోసం వేలకు వేల రూపాయలు బిల్లులు చెల్లించి, పదుల సంఖ్యలో వైఫై రూటర్ల ఏర్పాటు చేశారు. చాంబర్‌కు ఒక రూటర్, కమిషనర్ చాంబర్ పక్కన ఉన్న సమావేశ మందిరంలో వైఫై రూటర్ కేబుళ్లను ఎలుకలు కొరకడంతో ఇంటర్నెట్ రావడం లేదని సిబ్బంది చెబుతున్నారు. అయితే ఆ ఒక్క గదిలో వైఫై రాకపోతే మిగతా గదుల్లో వైఫై రాదా అనే ప్రశ్నలు ఉద్యోగుల నుంచి తలెత్తుతున్నాయి. అవకాశం ఉన్నా కావాలనే కొందరు సిబ్బంది మిషన్ల వినియోగంపై తాత్సారం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పోస్టర్లు ఆవిష్కరణ


పీడీఎస్‌యూ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఠాగూర్ ఆడిటోరియంలో అక్టోబర్ 24న జరగబోయే ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) అర్ధ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ సంఘం పూర్వ విద్యార్థి, సంఘం జిల్లా నాయకుడు గొర్రెపాటి రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని బచ్చోడులో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో పేదలు, అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ సమానమైన, శాస్త్రీయమైన విద్యను అందించాలని కోరుతూ పీడీఎస్‌యూ అనేక ఉద్యమాలు నిర్వహించిందని పేర్కొని విజయవంతం చేయాలని కోరారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పూర్వ జిల్లా నాయకులు శంకర్, గురవయ్య, శ్రీరామ్, లక్ష్మణ్,సతీష్, వెంకన్న, రవి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


పరిసరాలను శుభ్రం చేస్తున్న మేయర్ నీరజ, కార్పొరేటర్లు, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత అవసరం అని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. బుధవారం లకారం ట్యాంక్‌బండ్‌పై స్వచ్ఛతా హీ సేవా-2024లో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ ఆశయాల సాకారం కోసం ఈ కార్యక్రమం చేపట్టామని, ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎ.సంపత్‌కుమార్, కార్పొరేటర్లు ఆళ్ల నిరీషరెడ్డి, సరిపుడి రమా, శానిటేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య, ఎన్విరాన్‌మెంట్ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు బర్ధన్

ఖమ్మంమయూరిసెంటర్: కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిన మహనీయుడు, చిరస్మరణీయుడు ఏబీ బర్ధన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. బర్ధన్ శతజయంతి సందర్భంగా బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో బర్ధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. యుక్తవయస్సు నుంచి వామపక్ష భావజాలాన్ని అలవర్చుకున్న బర్ధన్ ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేశారని, కార్మిక హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. నిరంతరం కమ్యూనిస్టు ఉద్యమాలలో పనిచేస్తూ ప్రజా సమస్యల కోసం కృషి చేయడమే ఆయనకు మనమిచ్చే నివాళి అని ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితిసభ్యుడు యర్రా బాబు, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు బీజీ క్లైమెంట్, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, గాదె లక్ష్మీనారాయణ, పగిడిపల్లి ఏసు, యానాలి సాంబశివరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

తిరుమలాయపాలెం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు రూపొందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండి రమేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని కాకరవాయి గ్రామంలో సీపీఎం శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా వామపక్షాలకు ఆదరణ లభిస్తుందని అన్నారు. దేశంలో మతోన్మాద రాజకీయాలు పెరుగుతున్నాయని, రానున్న ఐదు రాష్ట్రాలు ఎన్నికల్లో బీజేపీ ఓటమి తప్పదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఆరు హామీలు, మూడు గ్రూపులుగా ఉందని, హామీల అమలులో వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఉద్యమాలు సాగించాలని అన్నారు. ఈ సందర్భంగా గ్రామశాఖ కార్యదర్శిగా వీరబోయిన నాగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు షేక్ బషీరుద్దీన్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు బింగి రమేష్, కొత్తపల్లి వెంకన్న, గుండాల వెంకన్న, వల్లోజు పరిపూర్ణచారి, కొత్తపల్లి మధు, సురిగి సతీష్, కొత్తపల్లి నాగరాజు, పెనుగొండ గోవిందయ్య, మధు, కొత్తపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.


కాకరవాయిలో మాట్లాడుతున్న బండి రమేష్

బీజేపీ మండల అధ్యక్షుడిగా సుధాకర్


పాగర్తి సుధాకర్

నేలకొండపల్లి: బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడిగా కొత్త కొత్తూరుకు చెందిన పాగర్తి సుధాకర్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ బుధవారం ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల వితరణ


హార్మోనియం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: తమకు విద్య నేర్పిన పాఠశాలలోని విద్యార్థులు నేర్చుకోవడానికి హార్మోనియం వాయిద్యాన్ని ఇచ్చి పూర్వ విద్యార్థులు(1991-1992 పదవ తరగతి బ్యాచ్) తమ వితరణ చాటుకున్నారు. నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో ఉన్న శ్రీరామకృష్ణ విద్యాలయంలో వితరణ చేయగా.. పాఠశాల హెచ్ఎం సంతోషకుమార్, సిబ్బంది వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పరిచయ కార్యక్రమం చేశారు.

ఆర్‌పీఎఫ్ రైజింగ్ డే వారోత్సవాలు

ఖమ్మంక్రైం: ఆర్‌పీఎఫ్ రైజింగ్ డే వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఖమ్మం రైల్వేస్టేషన్, రైల్వేగేట్ల వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పించారు. రైళ్లలో వచ్చి వెళ్తున్నప్పుడు ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వెంట తీసుకెళ్లకూడని వస్తువుల వివరాలను ఇన్‌చార్జ్ సీఐ సురేష్‌బాబు వివరించారు. అలాగే, కదులుతున్న రైళ్లపై రాళ్లు విసరడం, గేట్ వేసి ఉన్నప్పుడు దాటడం వల్ల ఎదురయ్యే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఏఎస్సై ప్రసన్నకుమార్, సిబ్బంది చిన్న రామయ్య, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పోషణ మాసోత్సవాలు

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: పోషణ మాసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈనేపథ్యాన ఖమ్మంరూరల్ మండలంలోని మద్దులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రూరల్ ప్రాజెక్ట్ సీడీపీఓ, మద్దులపల్లి ప్రత్యేక అధికారిణి కమలప్రియ పాల్గొని పౌష్టికాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పర్యవేక్షకులు శిశుర్మిల, షకీరా బేగం, జ్యోతి, విజయలక్ష్మి, సరిత, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి మండలం బోదులబండ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సరస్వతి పాల్గొని అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్లు పి.నాగమణి, పార్వతి, లక్ష్మికుమారి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన వి.కోటయ్య(53) రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆయన భార్య రమ బుధవారం ఫిర్యాదు చేయగా నేలకొండపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యవసాయ మంత్రికి వీఏఓల వినతి

ఖమ్మంవ్యవసాయం: తమ సమస్యలు పరిష్కరించాలని, ప్రతీ రెవెన్యూ గ్రామానికి గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించాలని కోరుతూ వ్యవసాయ విస్తీర్ణాధికారులు(వీఏఓ) బుధవారం ఖమ్మంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రాన్ని అందించారు. రైతు బంధు, రైతు బీమా, పీఎం కిసాన్, పంట నష్టం సర్వేలు, పంట కోత ప్రయోగాలు వంటి 49 రకాల పనులతో పాటు ఇతర పనులను కూడా ప్రభుత్వం తమకు అప్పజెప్పడంతో తలకుమించిన భారం అవుతుందని వివరించారు. ఏఈఓ సంఘాలతో చర్చలు జరిపి తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కోరారు. వినతి అందించిన వారిలో ఏఈఓల ఫోరం సభ్యులు నాగుల్ మీరా, శ్రీకాంత్, కుమార్, రాజా, మహేష్, దివ్య, ఇందు, భవాని, రాము, వెంకటేశ్వర్లు, ఆదర్శ్, రఘు, మౌనిక తదితరులు ఉన్నారు.


మంత్రి తుమ్మలకు సమస్యను వివరిస్తున్న ఏఈఓల ఫోరం సభ్యులు

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

రఘునాథపాలెం: గ్రామస్తులకు అందిస్తున్న తాగునీటి సరఫరాలో ఎక్కడా లీకులు లేకుండా, ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం రఘునాథపాలెంలోని రైతు వేదికలో జరిగిన పంచాయతీల పంప్ ఆపరేటర్లకు తాగునీటి సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. శుభ్రమైన తాగునీరు అందించేందుకు లీకులు లేకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని, ఇందుకు ప్రస్తుతం ఇస్తున్న శిక్షణలో నైపుణ్యాలు మెరుగుపర్చుకుని పనులు చేయాలన్నారు. అనంతరం మంచుకొండ పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అలాగే ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఓంప్రకాశ్, ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొని అవగాహన కల్పించారు.


మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి

అక్రమ నిర్మాణాలను గుర్తించండి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే వాటిని గుర్తించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సందర్శించిన ఆయన ధంసలాపురం వద్ద నూతనంగా నిర్మించనున్న ఎస్‌టీపీకి స్థల పరిశీలన చేశారు. నగరంలోని పలు డివైడర్లు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పెంచాలని అధికారులకు సూచించారు. ఖానాపురంహవేలి ప్రాంతంలో నూతనంగా నిర్మించబోయే యూపీహెచ్‌సీ స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. నూతనంగా నిర్మించబోయే డ్రెయినేజీలు ఎస్‌టీపీ వరకు చేరేలా లింకులు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, ఎస్ఈ రంజిత్, ఈఈ కృష్ణాలాల్, డీఈఈ ధరణి, ఏసీపీ వసుందర తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఖమ్మం మామిళ్లగూడెం: వరద బాధితులకు హైదరాబాద్ సోమాజీగూడ యశోద ఆస్పత్రి ఆధ్వర్యాన బుధవారం 11వ డివిజన్‌లోని సాయిబాబ గుడి పక్కన మండపంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే శరత్ మ్యాక్స్ విజన్ ఆధ్వర్యాన కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నిఖిల్, వర్షిత, సింధు, విక్రంసింగ్, శ్రీకాంత్, బి.లక్ష్మీకాంత్, పద్మారెడ్డి, సయ్యద్ ఫరీద్‌ఖాద్రి, చైతన్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీబీ వర్ధంతి

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాలుగోవ ర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కె.నవీన్‌బాబు బాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లు బీమా చేయించుకోవాలి

నేలకొండపల్లి: గ్రామ పంచాయతీలలో పని చేసే మల్టీపర్పస్ వర్కర్లు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పంచాయతీ వర్కర్లకు ఇన్సూరెన్స్ వలన కలిగే ప్రయోజనాలకు వివరించారు. ప్రజల ఆరోగ్యంతో పాటు కార్మికుల ఆరోగ్యం కూడా ముఖ్యం కావడంతో పంచాయతీ నిధుల నుంచి వారికి బీమా చేయిస్తున్నట్లు తెలిపారు. మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు


ఖమ్మం మామిళ్లగూడెం: సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీజేపీ నేతలు

ఖమ్మంఅర్బన్/ ఖమ్మంమామిళ్లగూడెం: నగరంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా కొనసాగించారు. ఈనేపథ్యాన బుధవారం నగరంలోని 13వ డివిజన్ శ్రీనగర్‌కాలనీలో పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జన్మదిన సందర్భంగా పార్టీ ఖమ్మం అర్బన్ టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు ఆధ్వర్యాన పార్టీ నేత తాండ్ర వినోదరావు బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి సభ్యత్వాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అంజన్న, అశ్విని, అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు సరస్వతి, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ పాల్గొన్నారు. అలాగే 24వ డివిజన్‌లోని పాకబండబజార్‌లో రుద్రప్రదీప్ ఆధ్వర్యాన కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటింటికి తిరిగి ప్రతీ మనిషికి ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వం అందించారు. జిల్లా అధికార ప్రతినిధి వీరభద్రప్రసాద్, రుద్రప్రతాప్, శ్రీనివాస్, రీజన్‌ప్రతాప్, సూర్యనారాయణ, షేక్ సైదావలి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేము సైతం..

- ఖమ్మంలీగల్: ఆకేరు వరద తాకిడికి నిరాశ్రయులైన ఖమ్మంరూరల్ మండలం కస్నాతండ గ్రామస్తుల పరిస్థితిని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రామ్మూర్తినాయక్ ఇండియన్ లాయర్స్ యూనియన్(ఐఏఎల్) దృష్టికి తీసుకురావడంతో జిల్లా కమిటీ స్పందించింది. ఈమేరకు బుధవారం ఖమ్మం జిల్లా కోర్ట్ ఆవరణలో సుమారు 200 దుప్పట్లు పంపిణీ చేశారు.
- ఖమ్మంరూరల్: మండలంలోని కస్నాతండా వరద బాధితులకు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ బుధవారం 300 కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు.
- ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మం సహకారనగర్: మున్నేరు వరద ముంపు బాధితులకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) ఆధ్వర్యాన బుధవారం కాల్వొడ్డులోని నయాబజార్ స్కూల్‌లో ఆహార పదార్థాలు, శానిటరీ సదుపాయాలు, ఇతర అత్యవసర వస్తువుల కిట్ల పంపిణీతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే నగరంలోని ధంసలాపురం మున్నేరు వరద బాధితులు 125 మందికి ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ పంపించిన నిత్యావసరాలను బుధవారం ఖమ్మం లయన్స్ క్లబ్ ప్రతినిధులు పంపిణీ చేశారు.
- ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరద బాధితుల కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంస్థ ద్వారా పలు ఐటీ కంపెనీలు అందజేసిన నిత్యావసర సరుకులను బుధవారం మేయర్ పునుకొల్లు నీరజ బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు.


ఖమ్మంలీగల్: పంపిణీకి సిద్ధంగా ఉన్న దుప్పట్ల వద్ద న్యాయవాదులు



ఖమ్మంగాంధీచౌక్: నిత్యావసరాలు అందిస్తున్న ఐఓసీఎల్ బాధ్యులు

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

ఖమ్మం వైద్యవిభాగం: నగరంలోని శ్రీరక్ష ఆస్పత్రికి సంబంధించిన రీహాబ్ బుద్ధలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యుడు గోంగూర వెంకటేశ్వర్లు(జీవీ) దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్యులు ఏడుకొండలు, వినయ్, అఖిలేష్, నర్సింహారావు, గోపి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న డాక్టర్ జీవీ, తదితరులు